

అర్చన రాంపల్లి

వాచ్‌మాన్ గేటు తీస్తోన్న చప్పుడయ్యింది.

కిటికీలో నుంచి తొంగిచూశాను.

చక్రవర్తి కారు లోపలికి దూసుకు వచ్చింది.

రోజ్‌వుడ్‌తో చేసిన గడియారం ఒంటిగంట చూపిస్తోంది!

ఆరు గంటల నిరీక్షణ!

ఎవరన్నారు నిరీక్షణ తీయగా ఉంటుందని! నిరీక్షణ అంత బాధాకరమైనది, భయపెట్టేది వేరొకటి లేదు!

ఈ మాట నా స్నేహితురాళ్ళు ఒప్పుకోరు! ''నిరీక్షణేవిటి? విరహం అనలేవూ? స్టేటస్‌కి తగినట్టు మాట్లాడటం కూడా తెలియదు!'' అంటారు.

చక్రవర్తికి చెప్తే, ''నిరీక్షణ బాధించదు! అందులోని ఒంటరితనం బాధపెడుతుంది! దాన్నుంచి బయటపడటం మన చేతుల్లో పని!'' అంటాడు.

''ఇంకా నిద్రపోలేదూ?'' చక్రవర్తి ప్రశ్న విని తలతిప్పి చూశాను.

సోఫాలో కూర్చుని షూ విప్పుకుంటున్నాడు.

నేను జవాబు చెప్పలేదు.

''భోజనం చేశావా?'' నా వైపు చూడకుండానే అడిగాడు.

''లేదు! నీకోసం ఎదురు చూస్తున్నాను!'' అసహనాన్ని అణుచుకుంటూ చెప్పాను. బెడ్‌రూమ్‌లోకి వెళ్ళబోతూ ఒక్క క్షణం ఆగాడు.

''భర్తకోసం ఎదురు చూస్తూ భార్య భోజనం చెయ్యకపోవడం, తోచనట్టు కూర్చోవటం, క్షణానికొకసారి కిటికీల్లోంచి తొంగిచూడటం... ఇవేవీ నాకు ఆనందం కలిగించవు పూజా! నీ దినచర్య ఎవరి కారణంగానూ గాడి తప్పకూడదు! కట్టుకున్న మొగుడైనా, కన్నబిడ్డే అయినా! నీ ఈ ఎదురుచూపు గుర్తు వచ్చే, పనిని మధ్యలో వదిలిపెట్టి వచ్చేశాను! ఫలితం... ఇరవై మూడు వేల రూపాయల నష్టం! కేవలం మనిద్దరం కలిసి డిన్నర్ చెయ్యడం ఇరవై మూడు వేలు ఖరీదు చేస్తోంది! హౌ రిడిక్యులస్!'' వెళ్ళిపోయాడు!

అప్పటిదాకా అంత ఆవేశాన్ని ఎలా ఆపుకున్నానో తెలియదు!

డైనింగ్ టేబుల్‌మీద వున్న నీళ్ళ జగ్గుని, గాజు టీపాయ్‌కేసి విసిరికొట్టాను.

పెద్ద శబ్దంతో రెండూ బద్దలయ్యాయి!

చక్రవర్తి వస్తాడు! జగ్గు ఖరీదు, టీపాయ్ ఖరీదు చెప్తాడు! ఆ సంపాదన తన ఎన్ని గంటల శ్రమ ఫలితమో గుర్తు చేస్తాడు!

సమాధానం సిద్ధం చేసుకున్నాను!

చక్రవర్తి నేప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ వచ్చాడు!

ఒక్క క్షణం కనుబొమ్మలెత్తి ఆశ్చర్యంగా చూశాడు!

క్షణమే! వెంటనే సర్దేసుకుని చాలా మామూలుగా అడిగాడు, ''ఏమిటిది?''

''నేను మనసుకు హత్తుకునే అనుభూతిని నిర్లక్ష్యం చేసిన ఫలితం! నా కోపం ఖరీదు!'' సాధ్యమైనంత సహజంగా చెప్పాను!

మరేం మాట్లాడలేదు అతడు! నిశ్శబ్దంగా భోజనం చెయ్యడంలో మునిగిపోయాడు.

ఈ ఊహించని నిశ్శబ్దం నన్ను వెర్రెత్తిస్తోంది.

నేను అసలు ప్రిపేర్డ్‌గా లేని సమయంలో తన

మాటలతో ఉక్కిరిబిక్కిరి చేసే ఇతను, నేనొక బలమైన వాదనని నిర్మించుకుని, దాన్ని చాలా కన్విన్సింగ్‌గా వినిపించబోతున్న సమయంలో మౌనం వహిస్తాడెందుకో అర్థంకాదు!

నేను ఆలోచనలలో ఉండగానే అతడి డిన్నర్ పూర్తయ్యింది!

❑❑❑

మర్నాడు రాత్రి రెండున్నరకి వచ్చాడు చక్రవర్తి!

''ఎందుకింత ఆలస్యం?'' మృదువుగా అడిగాను.

అతడి పెదవులు విచ్చుకున్నాయి!

''నిన్న నువ్వు కలిగించిన నష్టాన్ని భర్తీ చేసుకునే ప్రయత్నం!'' అంతకన్నా మృదువుగా చెప్పాడు.

''నువ్వు... నువ్వు...'' ఆవేశంలో మాటలు కూడా దొరకలేదు.

''నేను?'' అడిగాడు ప్రశాంతంగా!

''నువ్వొక బండరాయివి! నీకు హృదయం లేదు!''

''....''

''డబ్బు! డబ్బు! డబ్బు! డబ్బు సంపాదన తప్ప జీవితంలో నీకింకో లక్ష్యంలేదు! జీవితాన్ని అనుభవిద్దామన్న ధ్యాసలేదు! కట్టుకున్న భార్య గురించి ఆలోచన లేదు! సంపాదన నీకొక వ్యసనం...''

''కాదు! సంపాదన ఒక అవసరం!''

''దేనికైనా ఒక హద్దు ఉండక్కరలేదా?''

''దేనికైనా ఒక హద్దు వుండాలి నిజమే! డబ్బు సంపాదనకి తప్ప! అవసరాలన్నవి పెరుగుతూనే ఉంటాయి! వాటికోసం డబ్బు సంపాదిస్తూనే వుండాలి! అది తప్ప జీవితంలో నాకు వేరే లక్ష్యం లేదు! ఒప్పుకుంటాను! మిగతా అన్ని ఆశయాలతోనూ ముడిపడి వుండే ఏకైక లక్ష్యం ఇది!...''

''ఓహో! ఒక ఆదర్శవంతమైన భర్తగా బ్రతకడానికి కూడా ధనార్జనే లక్ష్యమా?'' వ్యంగ్యంగా అడిగాను.

''ఆదర్శవంతమైన భర్తగా బతకాలన్న తాపత్రయం నాకు లేదు! ఒక బాధ్యతగల భర్తగా బ్రతకాలన్న ఆలోచన మాత్రం వుంది! దానికి డబ్బు అవసరం!''

''సిగ్గులేదూ! భార్యతో ఇంత మెటీరియలిస్టిక్‌గా మాట్లాడటానికి, ప్రవర్తించడానికి? నీకు డబ్బుతో తప్ప మనసుతో సంభాషించడం చేతకాదు! ఆ మనసు విలువ అందులో నీ పట్ల కలిగిన ప్రేమ విలువ ఇంకేం అర్థం అవుతుంది? వ్యాపారంలో ప్రత్యర్థుల మనస్తత్వాన్ని గ్రహించగలిగే మేధస్సు ఉంది కానీ, కట్టుకున్న భార్య అంతరంగాన్ని తెలుసుకునే కనీసపు తెలివితేటలు మాత్రం లేవు! తెలుసుకోవలసిన అవసరం కూడా లేదు! ఎందుకంటే, దానివల్ల డబ్బు రూపంలో ప్రయోజనమేమీ లేదు కదా! భార్య నీకొక స్టేటస్ సింబల్! నీ పి.సి ఎలాగో, నీ మ్యూజిక్ సిస్టమ్ ఎలాగో భార్య అలాగ! వాటి మెయింటెనెన్స్ కోసమైనా, వారానికో గంటో, గంటన్నరో ఖర్చు చేస్తావు! నీ జీవన సహచరి మనసును స్పృశించే ప్రయత్నం మాత్రం చెయ్యవు!

## ఫ్రెండ్‌షిప్ అంటే...

**నాకు** ఫ్రెండ్‌షిప్ చేయడం అంతగా తెలీదు. (మరి హీరోలతో నాకున్నది ఫ్రెండ్‌షిప్ మాత్రమే అని ఎలా చెబుతోంది) ఇతరులతో ఫ్రెండ్‌షిప్ చేయకూడదనేం లేదుగానీ, అదేంటో నాకు తెలీదు. అంటోంది మత్తు సొగసుల మనీషా. నా సిక్స్త్ సెన్స్ మాత్రం నన్ను ఎప్పుడూ జాగ్రత్తగా ఉంచుతుంది. అంచేత సెట్‌పై పనివేళాక ఇక ఆ రిలేషన్ నా పర్సనల్ లైఫ్‌లోకి తీసుకురాను అంటోంది ఖరాఖండిగా. రింకీ ఖన్నా మాత్రం 'నాకు ఫ్రెండ్‌షిప్ చేయడానికి టైమే లేదూ' అంటే, అంజలా ఝువేరి అంతా పైకి బాగానే మాట్లాడతారు. లోపల మాత్రం అన్నీ రాసక్రీడలే అంటోంది. ఏమైందో ఈ అమ్మడికి, ఇలా మారిపోయింది.



''కలిసి కబుర్లు చెప్పుకోవడాలు, కలిసి భోజనాలు చెయ్యడాలు నీ దృష్టిలో అల్పమైన విషయాలు! ఇవన్నీ అనవసరమైన వ్యక్తికి రొమాన్స్ మాత్రం ఎందుకో? ఏ సంపాదనా లేని నిరుపయోగమైన పని కదా!...''

చక్రవర్తి ముఖం ఎర్రబడింది. ''పూజా!'' వారింపుగా పిలిచాడు!

''పెళ్ళి చేసుకోవడానికి డబ్బు, హోదా, అందం... ఇవికాదు చక్రవర్తీ ముఖ్యం! అనురాగంతో నిండిన మనసు, ఒకరిపట్ల మరొకరికి ప్రేమ! నీకసలు ప్రేమంటే తెలుసా? లేక అది కూడా ఏదో దేశపు కరెన్సీ అనుకుంటున్నావా ఏమిటి?''

''పూజా! స్టాపిట్! ఎనఫ్! ఎనఫ్ ఆఫ్ ఎవ్రీథింగ్!'' అరిచాడు. ఆగిపోయాను.

అతడి ముఖం ఎర్రబడి వుంది! కష్టం మీద తనని తను కంట్రోల్ చేసుకుంటున్నాడు.

వెనక్కి తిరగబోయాను.

చటుక్కున చేయందుకుని దగ్గరికి లాక్కున్నాడు! ఎడం చేత్తో చెంపలు నొక్కి పట్టుకుని పైకెత్తి, కళ్ళల్లోకి చూస్తూ ఒక్కొక్క పదం పేర్చుకుంటూ నెమ్మదిగా అడిగాడు, ''నీకు తెలుసా ప్రేమంటే ఏమిటో? ప్రేమంటే రోజంతా ఒకరినొకరు కౌగలించుకుని కూర్చోవడం కాదని నీకు తెలుసా? అలా కూర్చుంటే సంసారం గడవదని తెలుసా? ఆకలితో కడుపు మాడ్చుకుని, కిటికీల దగ్గర తచ్చాడుతూ సమయం వృథా చేసుకుని, ప్రేమని ప్రదర్శించక్కరలేదని నీకు తెలుసా?

ప్రేమను ప్రదర్శించడానికి, ప్రకటించడానికి చాలా తేడా వుందని తెలుసా? రొమాన్స్‌లో ప్రేమ ప్రకటించబడుతుంది! నువ్వనుకుంటున్నట్లు అదొక అవసరం కాదు! అదొక మానసిక ఆలంబన! మానసికమైన తోడు, ఒక ఉత్తేజం! రోజంతటి నిరీక్షణని విరహంగా మార్చి, ఆ విరహాన్ని కొద్ది కొద్దిగా కరిగించి, అందులో రోజంతా పడ్డ శ్రమని ఆవిరి చేసే రసానుభూతి!

మన పనులద్వారా, మాటలద్వారా ఎదుటి వ్యక్తికి ఆనందం కలిగించడం, ఆ ఆనందాన్ని పొందిన స్ఫూర్తితో, ఉత్తేజంతో రోజంతా పని చేసుకోవడం.

... ఇదే ప్రేమంటే! 'ఇదీ జీవితమంటే!' కనీసం నలభైలు, యాభైలు వచ్చేదాకా!''

నెమ్మదిగా వదిలిపెట్టాడు.

''అప్పుడు నువ్వు చెప్పిన పద్ధతిలో ప్రేమించుకోవడానికి జీవితమంతా మిగిలి వుంటుంది! కాలానుగుణమైన ప్రేమని ప్రకటించకపోతే, పరిస్థితులు తల్లక్రిందులైపోతాయి! అప్పుడు ప్రేమ గురించి ఆలోచించేంత తీరిక వుండదు! అదసలు ఆలోచించదగ్గ విషయంగా కూడా కనిపించదు! బాధాకరమైన పరిస్థితి అది!''

''....''

''నేనీ సంపాదన చూసుకోకుండా ప్రేమిస్తూ కూర్చుంటే, ఎప్పుడో నన్ను వదిలి వెళ్ళిపోయేదానివి! ప్రేమతో అవసరాలు తీరవన్న విషయం నీకూ తెలుసు కనుక! ఇవన్నీ అర్థం చేసుకోలేక, నీ అసహనాన్ని, అసంతృప్తిని ప్రకటించడానికి నన్ను టార్గెట్ చేస్తున్నావు పూజా!''

''....''

వాడిని లోపలికి పిలవమని చెప్పి, చేతిలో ఉన్న పుస్తకం షెల్ఫ్‌లో వుంచుతూ, యాథాలాపంగా దాని వంక చూశాను! 'గీత గోవింద కావ్యము!'

❑❑❑

''హాయ్ పూజా!'' సంభ్రమంగా అరిచింది మృదుల.

''నీతో పనుంది! ఎప్పుడు రమ్మంటావు?''

''నీలాంటి సాంప్రదాయ శిరోమణికి, ఈ పూర్ 'వీజె'తో ఏం పనబ్బా?''

''షటప్! ఎప్పుడు రమ్మంటావు చెప్పు!''

''నేనే వస్తాను! సాయంకాలం! ఆఫ్టర్ సిక్స్!''

''సరే అయితే! బై!''

❑❑❑

నా ప్రపోజల్ వినగానే సంభ్రమంగా కెవ్వుమంది మృదుల!

''మైగాడ్! స్ప్లెండిడ్! గ్రేట్ ఇన్ డీడ్! ఇప్పటి దాకా వచ్చిన అన్ని ఆల్బమ్ రికార్డ్‌లని బద్దలు కొట్టేంత బెస్ట్ సెల్లింగ్ ఆల్బమ్ అవుతుంది! అష్టపదు లకి వెస్టన్ మ్యూజిక్ అద్ది, మల్టీ ఇన్‌స్ట్రుమెంటల్ మెలోడితో దిద్ది, ఖజురహో దగ్గర యువతీ యువ కుల జంటల మీద పిక్చరైజ్ చేసి, రిలీజ్ చెయ్యా డమా! ఓ! మార్వలెస్! నాకు తెలిసినంత వరకూ తెలుగులో ఇలాంటి ప్రయోగం ఇదే ప్రథమం!''

''ఈ ప్రాజెక్ట్‌లో నీ సహాయం కావాలి నాకు!''

''సర్టెన్లీ! తప్పకుండా! నువ్వు పొమ్మన్నా పోను!''

''థాంక్స్! నాకు కొన్ని వివరాలు కావాలి ముందు!''

''అడుగు! అడుగు!'' సద్దుకుని కూర్చుంది.

❑❑❑


ఆల్బమ్ రిలీజ్ చేసే డేట్ దగ్గరపడుతోంది.

పనితో ఊపిరి తిరగడం లేదు!

వరల్డ్ ఫేమస్ 'వీజె'తో రిలీజ్ ఫంక్షన్ ప్లాన్ చేసింది మృదుల. నటీనటులు తమ అంగీకారాన్ని తెలుపుతూ ప్రాజెక్ట్‌కి సైన్ చెయ్యడాన్ని కాల్‌షీట్స్ ఇవ్వడమంటారన్న ప్రాథమిక పరిజ్ఞానం కూడా లేని పరిస్థితి నుంచి, మల్టీమీడియా మ్యూజిక్ సిస్టమ్స్ గురించి, కాంపాక్ట్ డిస్క్, వి.డిల గురించి, వాటి ప్రాధాన్యత గురించి చర్చించగల స్థాయికి తీసుకు వచ్చి వదిలిపెట్టింది మృదుల.

ఒక్కొక్క విషయమే తెలుస్తున్న కొద్దీ, మన చుట్టూ వున్న ప్రపంచం ఎంత విశాలమైనదో, ఎన్ని అవకాశాలనందించేదో అర్థం అవుతూ వచ్చింది.

కొత్తల్లో వంటరిగా చక్రవర్తికోసం ఎదురు చూస్తూ, ఇంత జీవితాన్ని మిస్ అయ్యేదాన్నా అని బాధపడేదాన్ని! ఇప్పుడు దానిక్కూడా టైమ్‌లేదు! కొత్త వ్యక్తులతో పరిచయాలు, కొత్త పరిసరాలు – మనసుని, మెదడుని, శరీరాన్ని... అన్నిటినీ బిజీగా




''మాట్లాడు పూజా!''

''ఏం మాట్లాడాలి? నన్ను అర్థం చేసుకోలేక పోవడం నీ లోపమూ, నీకు అర్థం అయ్యేలా ప్రవర్తిం చకపోవడం నా లోపమో అర్థం కావటంలేదు! బాధ్య తలని విస్మరించి ప్రేమిస్తూ కూర్చోమని, ఏ భార్యా చెప్పదు చక్రవర్తీ! పనులు పూర్తి చేసుకుని ప్రేమిం చడం సంగతి నువ్వు మాట్లాడుతున్నావు, ప్రేమిస్తూ పనులు చేసుకోవడం విషయం నేను చెప్తున్నాను. నీకు ప్రకటనగా కనిపించే ప్రేమ నాకు ప్రదర్శన! నాకు ప్రకటనగా అనిపించే ప్రేమ నీకు ప్రదర్శన! రాత్రి భోజనం చెయ్యకుండా ఎదురు చూడటంలో ప్రేమ వుందని, నేననుకుంటున్నాను. మనిద్దరం కలిసి గడిపే సమయం గురించి నేనాలోచిస్తూంటే, భోజనం చెయ్యకుండా త్యాగం చేస్తున్నానంటున్నా నని నువ్వర్థం చేసుకుంటున్నావు! నేను బాధపడేది, నా ఉనికికొక అస్థిత్వం... గుర్తింపు.. లేదనే!''

''అవన్నీ వదిలెయ్ పూజా! నువ్వొక వ్యాపకం కల్పించుకుందుకు ప్రయత్నించు! సమయం గడ వకపోవడమన్న ప్రశ్నే ఉండదు!'' అనునయంగా చెప్పాడు.

దెబ్బతిన్నట్టనిపించింది!

'నాకు సమయం గడవక నీ సహచర్యాన్ని ఆశిస్తు న్నాననుకుంటున్నావా? అలా ఎప్పటికీ భావించకు!'

అతడి ఎదురుగా నిలబడటానికి కూడా మనస్క రించలేదు.

గబగబా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాను.

చక్రవర్తి చెప్పే ప్రతి మాటా అర్థవంతమైనదే! ఆచరించతగ్గదే! కానీ అతడు నా సమస్యని సరైన కోణం నుంచి ఆలోచించట్లేదనిపిస్తోంది. అన్నిటినీ మించి, నాకేదో సమయం గడవక అతడితో గొడవ పడుతున్నానన్నట్టు మాట్లాడడం గాయపరిచింది.

అసలు నేను వంటరిగా ఇబ్బంది పడాల్సిన అవ సరమేముంది? నా వ్యాపకాలు నేను కల్పించుకో లేనా? అతడి ఆధారం లేకపోతే సంతోషంగా జీవించ లేనా? అసలు మగవాడి మనస్తత్వమే అంత!

భార్యగా ఒక పరిధి మేరకు ఆధారపడితే ఆనం దంగానే వుంటుంది! ఆ పరిధి దాటి అతడి బాధ్యత ప్రదర్శించవలసిన పరిస్థితి ఎదురైతే మాత్రం బరువై పోతుంది!

ఛ! నేనింత బలహీనపడటమేమిటి? నెవర్! నీ ప్రపంచం నేనూ సృష్టించుకోగలను! అతడి కంటే విశాలమైన, ఆహ్లాదకరమైన ప్రపంచాన్ని! అందులోకి అతడిని, అతడి ప్రపంచంతో సహా ఆహ్వానిస్తాను! అప్పుడు చెప్తాను, 'ప్రేమంటే ఇది!' అని!

ఆ ఆలోచన రాగానే మనసు తేలికపడింది! నిశ్చింతగా నిద్రపోయాను!

❑❑❑

నా దృష్టి పుస్తకాల బీరువా మీద పడింది!

పొద్దుటి నుంచి తోచనట్టు తిరుగుతోన్న నేను, చకచకా దాని దగ్గరికి వెళ్ళి తలుపులు తెరిచాను!

'ఇంత మంచి వ్యాపకాన్ని విస్మరించి, నీ కోసం ఎదురు తెన్నులు చూస్తూ కూర్చున్నందుకు మంచి పాఠమే చెప్పావు!' తిట్టుకుంటూ పుస్తకాలన్నీ బయ టికి తీశాను!

హఠాత్తుగా వినిపించింది... ''లలిత లవంగ లతా పరిశీలన... మలయ.. సమీరే!...'' ఎవరో కుర్రవాడు జయదేవుడి అష్టపదులు పాడుకుంటూ వెళుతున్నాడు.

ప్యూబర్టీలోని కంఠం ఒకలాంటి జీరతో కలిసి, మధురంగా పలుకుతోంది వాచ్‌మాన్‌కి ఆ కుర్ర

వుంచేంత పని!

ఒక్కొక్కసారి పనితో అలిసిపోతే, డ్రైవ్ చేసే ఓపిక కూడా వుండేది కాదు! మృదుల కార్లో వెనుక సీట్లో నిద్రపోతే, తనే ఇంటికి తీసుకొచ్చి, నిద్రలేపేది!

''థాంక్స్ మృదూ!''

కారు రివర్స్ చేసుకుంటూ అంది. ''చక్రవర్తి వచ్చినట్టున్నాడు! ఎదురు చూస్తున్నాడేమో!''

''టైమెంతయ్యింది?'' బరువుగా మూసుకుపోతున్న రెప్పలెత్తి అడిగాను!

''క్వార్టర్ టు వన్!''

''బై!''

మేడమీదకి వచ్చేసరికి చక్రవర్తి డైనింగ్ టేబుల్ దగ్గర ఎదురు చూస్తున్నాడు.

నా మనసులో ఆనందం వీచికలా కదిలింది!

దాన్ని అణిచేసుకుంటూ చెప్పాను. ''గుడ్‌నైట్ చక్రవర్తీ!''

''డిన్నర్ అయిందా?'' పరిశీలనగా చూస్తూ అడిగాడు.

నేను సమాధానం చెప్పలేదు! బెడ్‌రూమ్‌లోకి దారితీశాను!

లేచి వచ్చి చేయి పట్టుకున్నాడు.

''భోజనం చేశావా అని అడుగుతున్నాను!''

''ఏం పాపం? నువ్వు భోజనం చెయ్యకుండా ప్రేమని ప్రకటించడానికి.. సారీ ప్రదర్శించడానికి సిద్ధపడి కూర్చున్నావా?''

గబగబా లాక్కెళ్లి టేబుల్ దగ్గర కూలేశాడు.

బలవంతంగా విదిలించుకున్నాను.

''ఎన్నిసార్లు నువ్వు డిన్నర్ చెయ్యకుండా రాలేదు? ఎప్పుడైనా ఇలా దౌర్జన్యంగా ప్రవర్తించానా?'' అరిచాను.

''షటప్! నేనేమీ అన్నం తినకుండా ఎదురు చూడటం లేదు! నా డిన్నర్ పూర్తయ్యింది! రాత్రి ఆహారం లేకుండా నువ్వు తట్టుకోలేవు! రేపొద్దున్న రికార్డింగ్ వున్నట్టుంది కదా! మొండితనం చెయ్యకు! అన్నీ సిద్ధం చేశాను! తినేసి, వెళ్ళిపడుకో!''


మనసు అంతరాళాలలో ఎక్కడో ఆర్ద్రమయ్యింది!

ఆ ఆర్ద్రత అనురాగమై ఎగజిమ్మకుండా అదిమిపెడుతూ అడిగాను.

''నేనూ ఇందుకే ఎదురు చూసేదాన్ని! డు యు అండర్ స్టాండ్?''

''నీకూ, నాకూ చాలా తేడా వుంది! అన్నం మానేసి అలక సాగించడం, సాధించడమనుకుంటున్నావు! నేనలా అనుకోను! నా ఆరోగ్యం మీద నాకు జాగ్రత్త వుంది, బాధ్యత ఉంది!''

అరగంట అనంతరం నిద్రలోకి జారిపోతూ అనుకున్నాను ''త్వరలో వస్తుందా రోజు! అలకకీ, అనురాగానికీ తేడా తెలుస్తుంది!''




❑❑❑

ఊహించినట్టుగానే సెన్సేషనల్ హిట్ అయింది!

పరిశ్రమ నుంచి, మీడియా నుంచి పొగడ్తలు వెల్లువెత్తాయి!

ఎన్నడూ ఎరగనంత ఆనందం!

గుర్తింపు ఇంత ఉత్సాహ భరితంగా ఉంటుందా?

ప్రాజెక్టు పూర్తయ్యాక మిగిలిన డబ్బు చూసుకుంటే సంతోషం ఉరకలు వేసింది!

ఎంత కష్టపడితే వచ్చిన సంపాదన ఇది? ఎంత పరిశ్రమకి మూల్యం?!

చేతిలో ఉన్న 'నోట్లని' అపురూపంగా చెంపకి హత్తుకున్నాను! ఏదో అలికిడి అయినట్టనిపించింది! కళ్ళు తెరిచి, తలెత్తి చూశాను!

చక్రవర్తి చిరునవ్వుతో చూస్తున్నాడు.

చటుక్కున లేచి, లోపలికి వెళ్ళిపోయాను!

అతడేమీ మాట్లాడలేదు! ఏమీ వ్యాఖ్యానించలేదు. నిజమే! కానీ ఏదో వెలితిగా ఉంది! అర్థంకాని భావం ఏదో ఆలోచనలలో అలజడి కలిగిస్తోంది!

చక్రవర్తికి వ్యాపారంలో కలిగిన సంతృప్తి ఇలాంటిదేనా?

ఇదేనా? ఇంకా ఇంకా పని చేయాలన్న తపనని రేకెత్తిస్తోందా? అయితే మాత్రం, తనకంటూ ఒక భార్య ఉందన్న విషయం మర్చిపోయేంతగా ఇమ్మర్స్ అయిపోవాలా?

❑❑❑

మొదటి విజయం ఇచ్చిన స్ఫూర్తితో, ఉత్తేజంతో రెండో ప్రాజెక్టు మొదలయ్యింది.

మెలోడి ప్రధానంగా సాగిన జానపద గీతాలన్నీ ఏర్చికూర్చి, గ్రూప్ డాన్సర్ల మీద పిక్చరైజ్ చేసి రిలీజ్ చేశాను!

మా అందరి ఎక్స్‌పెక్టేషన్స్‌కి విరుద్ధంగా అనూహ్యంగా, ఫెయిల్ అయింది!

అంత షాక్‌కి నేనెప్పుడూ గురవ్వలేదు.

అడ్వర్‌టైజ్‌మెంట్ కాంపైన్‌లో లోపమో, మితిమీరిన ఆత్మవిశ్వాసమో, హై ఎస్టిమేషన్స్ వుండటమో... ఏదో అర్థం కాలేదు!

సంపాదించిన డబ్బంతా వెచ్చించి, సర్వశక్తులూ ఒడ్డి, అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా చేసిన కృషి, ఇంత నిరాశాజనకమైన ఫలితాలనిస్తుందని నేను ఊహించలేదు!

ఓటమి ఎదురైనందుకు కాదు బాధ!

గెలుపు వదిలి పోయినందుకు!

గెలుపుకి సుఖం, సంతోషం, గుర్తింపు, పొగడ్త, సంతృప్తి... ఇవన్నీ నేస్తాలే!

ఓటమికి డిప్రెషన్ ఒకటే నేస్తం!

ఓటమి కలిగించే అవమానం ఇంత భయంకరంగా ఉంటుందా?

అందుకేనా ఓటమికి అంత భయపడతారందరూ! అహరహం గెలుపుకోసం శ్రమించేదందుకేనా?!


మృదుల కూడా ఫోన్ చెయ్యడం తగ్గించేసింది. నిరాశ, నైరాశ్యం!

హృదయం నిండా గూడు కట్టుకున్న దుఃఖం కంటిద్వారా బయటపడితే అయినా ఓదార్పు! నిద్ర వస్తే అయినా, దిగులు కొంత మరుపు!

''ఏవిటాలోచిస్తున్నావు?'' భుజం మీద చెయ్యి వేస్తూ అడిగాడు చక్రవర్తి.

ఏం లేదన్నట్టు తల ఊపాను.

''బయటికి వెళదామా?''




''ఎక్కడికి?'' రెండు నిముషాలాగి అడిగాను.

''నీ ఇష్టం! నీకెక్కడ బాగుంటే అక్కడికి!''

''నువ్వు ఆఫీస్‌కి వెళ్ళాలేమో!''

''అవసరం లేదు!''

హఠాత్తుగా గుర్తొచ్చింది! చక్రవర్తి ఈ మధ్య త్వరగా ఇంటికి వస్తున్నాడు. సాయంకాలం నాలుగు లోపే! ఇంటా, బయటా అన్ని పనులూ తనే చూసుకుంటున్నాడు.

ఆ తర్వాతి సమయమంతా నా కోసమే వెచ్చిస్తున్నాడు!

ఎన్ని మాటలు?? ఎన్నెన్ని మాటలు?! ఇవన్నీ ఇంతకాలం ఎక్కడ దాగున్నాయో అనిపిస్తుంది ఒక్కోసారి!

చక్రవర్తిలో ఇంతటి పరిజ్ఞానం నేనూహించలేదు! మాటల్లో అతడు స్పృశించని రంగం లేదు.

విజయం సాధించడం ఎలాగో, ఎప్పుడు ఎలాంటి టెక్నిక్స్ అవలంబించాలో... ఒక్కొక్కటి సోదాహరణంగా వివరిస్తుంటే, తెలియని కొత్త ఉత్సాహం ఏదో కలుగుతుంటోంది! మనసు సేద తీరుతున్నట్టు అనిపిస్తూంటుంది.

చక్రవర్తి సహచర్యంతో ఆహ్లాదంగా గడిచిన ఓ సాయంకాలం– ఒక ప్రైవేట్ టెలివిజన్ ఛానెల్‌లో అకస్మాత్తుగా నా ఆల్బమ్ కనిపించింది!

ఆసక్తిగా చూశాను!

''టాప్ ఫ్లాప్' శీర్షికన ప్రసారమైన ఆ కార్యక్రమంలో నా రెండవ ఆల్బమ్‌ని మొదటి స్థానంలో ప్రదర్శించారు.

పొరలు, పొరలుగా పేరుకున్న దుఃఖం ఒక్కసారి బద్దలై కన్నీళ్ళ రూపంలో స్రవించింది!

చక్రవర్తి కంగారుగా నా చేతులని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

''నేను ఓడిపోయాను!'' ఒక్కసారిగా బరస్ట్ అయిపోయాను.

చక్రవర్తి మాట్లాడలేదు! మౌనంగా నా వీపు తడుతూండి పోయాడు.

పావుగంట తర్వాత నా తలని నెమ్మదిగా పైకెత్తి, నా కళ్ళల్లోకి చూస్తూ చెప్పాడు ''పోటీ అనే నాణానికి గెలుపోటములు రెండు పార్శ్వాలు! గెలుపుని చవి చూశావు, ఓటమిని రుచి చూశావు, నువ్విప్పుడు పరిపూర్ణమైన పోటీదారువి! తెలివైన వాళ్ళు ఏం చేస్తారో తెలుసా?''

''......''

''ఓటమి తాలూకు నిరాశతో గెలుపు కవసరమయ్యే ఇంధనాన్ని తయారు చేసుకుంటారు!''

''చటుక్కున కళ్ళెత్తి చూశాను!''

ఎంత బాగా చెప్పాడు!

''మరొక ప్రయత్నం చెయ్యి పూజా! నిశ్చయంగా గెలుపు నీదే!''

❑ ❑ ❑

చక్రవర్తి ఫైనాన్సర్‌గా మరో ప్రాజెక్టు ప్రారంభమయ్యింది. ఈసారి థీమ్‌కి నేను పెద్దగా వెతుక్కోవలసిన అవసరం లేకపోయింది. నాకు చక్రవర్తికి మధ్య జరిగిన సంఘటనని బేస్ చేసుకుని, అర్థవంతమైన ప్రేమ గీతం వ్రాయించి, భావప్రకటన అద్భుతంగా వున్న జంటని వెతికి... అందమైన లొకేషన్స్‌లో షూట్‌చేసి, రిలీజ్ చేశాను.

ఈసారి ఎవరి అభిప్రాయాలనీ తెలుసుకోవాలని ప్రయత్నించలేదు! ఎవరి మెప్పుకోలుకీ ఎదురుచూడలేదు. నాకు తోచిన తీరులో పని చేసుకుంటూ సాగిపోయాను.

అప్పుడప్పుడు చక్రవర్తికి ప్రాజెక్టు ఏ స్టేజ్‌లో వుందో చెప్పేదాన్ని. తన అభిప్రాయాలని నిర్మొహమాటంగా, నిస్సంకోచంగా వెల్లడించేవాడు.

మృదులతో అసోసియేట్ అయివున్నప్పుడు, చిన్న వ్యాఖ్య కూడా మనసుకి ఎంతో కష్టం కలిగించేది.

ఇప్పుడిప్పుడే ఏది సద్విమర్శో, ఏది వ్యాఖ్యానమో, ఏది పొగడ్తో, ఏది వెనక్కి లాగడమో, ఏది అసూయో తెలుసుకుంటున్నాను.

ఫైనల్ స్టేజ్‌లో వుండగా మృదుల కాంటాక్ట్ చేసింది.

''రిలీజ్ ఫంక్షన్ కళ్ళు చెదిరిపోయేలాగా వుండాలి!'' అంది.

నేను జవాబు చెప్పలేదు.

ప్రయివేటు టి.వి ఛానెల్స్‌కి, ప్రెస్‌కి క్లుప్తంగా ఇన్‌ఫర్మేషన్ పంపి, స్వంతంగా రిలీజ్ చేశాను!

మొదటిసారి ఉన్నంత ఉద్వేగ్నత, రెండవసారి ఉన్నంత నమ్మకం, అది ఫ్లాప్ అయిందని తెలిసినప్పుడున్న ఉదాసీనత... ఏదీ లేదు! చెయ్యదలచుకున్న పనిని అంకిత భావంతో, చిత్తశుద్ధితో పూర్తి చేశాక, కలిగే నిశ్చింత, సంతృప్తి!

రిలీజ్ చేసిన రెండో రోజుకి ఫలితం తెలిసింది.

'మెగాహిట్!'

వారం రోజుల్లోపు వందలు దాటి, వేలు, లక్షలకి చేరుకుంది. ఆ సాయంకాలం – 'టాప్ టెన్'లో నా ఆల్బమ్స్‌ని మొదటి స్థానంలో చూసి, ఆఫ్ చేసేశాను.

❑ ❑ ❑

వాచ్‌మెన్ గేటు తీస్తోన్న చప్పుడయింది.

చక్రవర్తి కారు లోపలకి దూసుకు వచ్చింది. గడియారం ముల్లు పన్నెండు చూపిస్తోంది.

ఐదు గంటల నిరీక్షణ! నిరీక్షణ ఎంత మధురంగా ఉంటుంది!? ఎంత హృద్యంగా ఉంటుంది?!

''ఇంకా నిద్రపోలేదూ?''

తలెత్తి చూశాను. ''లేదు!''

ఎప్పట్లా వెళ్ళిపోలేదు! ఒక్క క్షణం తేరిపార చూసి, దగ్గరగా వచ్చి ''ఎందుకు?'' అడిగాడు మెత్తగా!

అతడి భుజాల చుట్టూ చేతులు వేసి దగ్గరికి లాక్కున్నాను ''ఇందుకు!'' అన్నాను నవ్వుతూ!

మైకమై, మోహమై, మౌనమై, ముద్దై....